క్లుప్తంగా

అయోధ్య రాముల అక్షింతలు పంపిణీ



అనుపు గ్రామంలో అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళుతున్న రామభక్తులు

గుడిపాల: అయోధ్య రాముల అక్షింతలను గ్రామాల్లో ఆయా కుటుంబాలకు సోమవారం పంపిణీ చేశారు. అడవిచేను, పల్లూరు, అనుపు గ్రామాల్లో రాముల భక్తులు తొలుత భజన చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ అక్షింతలను పూజ రూముల్లో ఉంచుకుని జనవరి 22వ తేదీన అయోధ్య రామమందిరం ప్రారంభం సమయంలో తలపై చల్లుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటా ఐదు దీపాలను వెలిగించాలని కోరారు.

హనుమాన్ క్రికెట్ టోర్నీ విజేత చెన్నారెడ్డిపల్లె



విన్నర్స్‌కు ట్రోఫీ అందిస్తున్న బీఎంఆర్ మోహన్ రెడ్డి, హరిబాబురెడ్డి

యాదమరి: మండలంలోని చెన్నారెడ్డి పల్లెలో మూడు రోజులుగా నిర్వహించిన హనుమాన్ క్రికెట్‌టోర్నీలో చెన్నారెడ్డి పల్లె జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణంపల్లె జట్టుపై గెలుపొందింది . విజేత జట్టుకు వైఎస్సార్‌సీపీ నేత బీఎంఆర్ మోహన్ రెడ్డి, ఎస్ఆర్‌వి హరి బాబు రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలత బాలకృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నాటు తుపాకులను స్వచ్ఛందంగా ఇవ్వాలి

బంగారుపాళెం: మండలంలో నాటు తుపాకు లు కలిగిన వ్యక్తులు స్వచ్ఛందంగా పోలీస్‌స్టేష న్‌లో అప్పగించాలని డీఎస్పీ సుధాకర్ రెడ్డి తెలిపారు. అక్రమంగా నాటు తుపాకులు కలిగి ఉండడం చట్టరీత్యా నేరమన్నారు. అటవీ సరిహ ద్దు గ్రామాల్లో నాటు తుపాకులు కలిగి ఉన్నవా రు వెంటనే వాటిని తెచ్చి స్టేషన్‌లో అందించా లన్నారు. నాటు తుపాకులు తెచ్చిఇవ్వని వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా రేణుకాంబ తిరునాళ్ల



గట్రాళ్లమిట్టలో రేణుకాంబ

గుడిపాల: మండలంలోని గట్రాళ్లమిట్టలో మంగళవారం రేణుకాంబ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలను నిర్వహించి గ్రామస్తులు మొక్కులు చెల్లించారు. అలాగే బొమ్మసముద్రంలో సీతారామ దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం సీతారాముల కళ్యాణం కనుల పండువగా నిర్వహించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు రూరల్: బంగారుపాళ్యం మండలం కొటప్పగారిపల్లెలో మంగళవారం ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. శిల్ప (32)అనే మహిళ నుంచి 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది సుబ్రమణ్యం గౌడు, కిరణ్‌కుమార్, వెంకటేష్, మమత, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

14వ డివిజన్‌లో 'వికసిత్ భారత్'

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక 44వ డివిజన్‌లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని బీజేపీ చిత్తూరు మండల అధ్యక్షుడు రామభద్ర నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రికెట్ పోటీలు

పూతలపట్టు: స్థానిక ఉన్నత పాఠశాల మైదానం, పోలవరం, మద్దులయ్యగారిపల్లె మైదానంలో బుధవారం మండలస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి మంగళవారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పీడీలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

వైఎస్సార్ సీపీని ఆదరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పక్కన విజయానందరెడ్డి



హాజరైన నాయకులు, ప్రజలు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- గుడిపాలలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పరిచయ వేదిక
- సమన్వయంతో ముందుకుపోవాలని పిలుపు

గుడిపాల: చిత్తూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని ఆదరించాలని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం గుడిపాలలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలతో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2019 ఎన్నికలలో చిత్తూరు నియోజకవర్గంలో 39వేల మెజారిటీతో వైఎస్సార్ సీపీని గెలిపించారని, 2024 ఎన్నికల్లోనూ అంతకుమించి రెట్టింపుతో గెలిపించాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించామని, దీనిని దృష్టిలో ఉంచుకుని ధైర్యంగా వెళ్లి ఓట్లు అడగాలన్నారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ, టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టడం ఒక వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. కనుమ పండుగరోజు గుడిపాలలో పరిచయ వేదిక ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. 27 పంచాయతీల్లోని పార్టీ నాయకులు సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సహకారంతోనే తామంతా ముందుకు పోతున్నట్లు చెప్పారు. పార్టీ నిర్ణయాల మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వినాయక బాలాజీ, రాజేష్‌రెడ్డి, రజనీకాంత్, శిలంబరసన్, శ్రీధర్‌రెడ్డి, మాపాక్షి మోహన్, మధు, రమ్య, చిట్టి, మణి, జయకోడి, రవీంద్రారెడ్డి, సంపూర్ణమ్మ, రమణ, విక్టర్, లారెన్స్, గోపి, సంపత్, కారిమేగన్, అన్బు, మనోహర్‌రెడ్డి, గుండుసాయి, సాయిక్రిష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుప్పిగానిపల్లెలో సత్యమ్మకు పూజలు చేస్తున్న విజయానందరెడ్డి



ప్రచారానికి శ్రీకారం

- చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తకు ఆత్మీయ స్వాగతం

గుడిపాల: మండలంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి మంగళవారం పార్టీ పరంగా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. నారగల్లు, ఏఎల్‌పురం, సీఎంకండిగ, కమ్మతిమ్మాపల్లె, నంగమంగళం, మందిక్రిష్టాపురం, గట్రాళ్లమిట్ట పంచాయతీలలో ఆయన పర్యటించారు. ఆయా పంచాయతీల్లో ఆయన ప్రజలు, నాయకులు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని, చేసిన మేలును గుర్తెరిగి ఆశీర్వదించాలన్నారు. నాయకులంతా ఎలాంటి విభేదాలు లేకుండా పార్టీని గెలిపించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, డెప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు జనార్దన్ ఎంపీటీసీలు గోళ్ల హరిప్రసాద్, యోవాన్, చిట్టిబాబు, సాము వేలు, శ్రీదేవి, సర్పంచులు రజనీకాంత్, మోహన్‌నాయుడు, మధుసూదన్‌రాయల్, మధుసూదన్‌రెడ్డి, జయకోడి, వైఎస్సార్ సీపీ నాయకులు శిలంబరసన్, మనోహర్‌రెడ్డి, కలైఅరసి, ప్రతాప్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సాయిక్రిష్ణ, సాయిప్రతాప్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

• మకరజ్యోతి దర్శనం



స్వామివారి తిరుఆభరణాలతో అయ్యప్పస్వామి ఊరేగింపు, ఊరేగింపులో స్వామివారు (ఇన్‌సెట్‌లో)

గుడిపాల: మండలంలో 197 రామాపురంలోని వీరబ్రహ్మంగారి మఠంలో ఉన్న అయ్యప్పస్వామి మందిరంలో మంగళవారం మకరజ్యోతి దర్శనం భక్తులకు కల్పించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి దీపారాధన చేశారు. సాయంత్రం అయ్యప్ప స్వామికి పాలాభిషేకం, నేతి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆరు గంటలకు తిరు ఆభరణాలను స్థానిక శివాలయం నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఆపై పడిపూజ నిర్వహించి కర్పూర హారతితో జ్యోతి దర్శనం భక్తులకు కల్పించారు. ఉత్సవ మూర్తులైన మణికంఠ బాలునికి విశేష అలంకరణ చేసి, పుష్పపల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో గురుస్వామి మురారి కన్నయ్య దాసు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.



చిత్తూరురూరల్: ఊరేగింపులో ఆలయ నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్‌లో..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ శాస్తగిరి అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకర జ్యోతి దర్శనం కల్పించారు. ఆలయంలో ఉదయం అభిషేక పూజలు చేశారు. అనంతరం మకర జ్యోతి దర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత నగర వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వలంటీర్లకు గ్రైండర్ల పంపిణీ



వలంటీర్‌కు గ్రైండర్ అందిస్తున్న మోహన్‌రెడ్డి

ఐరాల: నాగంవాండ్లపల్లె, ఐరాల పంచాయతీ పరిధిలోని 34 మంది వలంటీర్లకు సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత పూజారి మోహన్‌రెడ్డి తన సొంత నిధులతో గ్రైండర్లు పంపిణీ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన తన గెస్ట్‌హౌస్‌లో కానుక అందజేశారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలో కూడా విశేష సేవలందించారని తెలిపారు. వారి సేవలు వెలకట్టలేనివని, అందుకే పండుగను పురస్కరించుకుని కానుక అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ధనచంద్రారెడ్డి, రాజేష్‌రెడ్డి, నాగరాజా, భానుప్రకాష్, గణేష్ పాల్గొన్నారు.

కుప్పం కమిషనర్‌గా రాధిక

పుంగనూరు: కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతి కార్పొరేషన్‌లో సెక్రటరీగా పని చేస్తున్న కె.రాధికను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అక్కడ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పని చేస్తున్న పుంగనూరు కమిషనర్ నరసింహప్రసాద్‌కు అదనపు బాధ్యతలను తప్పించారు. మంగళవారం రాధిక బాధ్యతలు స్వీకరించారు.

హంద్రీ-నీవా పనులను పరిశీలించిన ఎమ్మెల్సీ



పంప్ హౌస్ వద్ద హంద్రీ-నీవా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- నేడు మండలంలోకి ప్రవేశించనున్న కృష్ణా జలాలు
- జలహారతి ఇవ్వనున్న ఎంపీ, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్

రామకుప్పం: మండలంలో జరుగుతున్న హంద్రీ-నీవా పనులను మంగళవారం చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పరిశీలించారు. బైపరెడ్లపల్లె పంచాయతీ వర్దికుప్పం సమీపంలో హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు మండలానికి రానున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు పెద్ద ఎత్తున జలహారతి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు. తనతోపాటు ఎంపీ రెడ్డెప్ప, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట మేరకు కుప్పం నియోజక వర్గానికి కృష్ణా జలాలు తీసుకువస్తున్నట్లు చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో పెండింగ్‌లో ఉన్న హంద్రీ-నీవా పనులను త్వరితగతిన పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ ఆనంద్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

డాక్టర్లను నియమిస్తాం

- జాయింట్ కమిషనర్ సరళమ్మ



ప్రభుత్వాసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ సరళమ్మ

పుంగనూరు: స్థానిక ఏరియా ఆసుపత్రికి అవసరమైన డాక్టర్లు, సిబ్బందిని త్వరలో నియమించి 24 గంటలు వైద్యసేవలు అందిస్తామని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ సరళమ్మ తెలిపారు. సోమవారం ఆమె డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డితో కలసి ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రి కమిటి చైర్మన్ డాక్టర్ శరణ్‌తో చర్చించారు. ఆమె మాట్లాడుతూ, సిబ్బంది నియామకంతోపాటు అవసరమైన సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలో సేవలు బాగున్నాయని కితాబిచ్చారు. డాక్టర్లు, నర్సులు పాల్గొన్నారు.

రహదారి భద్రతలు పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాఘవరెడ్డి, పక్కన ఆర్టీసీ డీఎం

పుంగనూరు: ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలను పాటించి ప్రమాదాలు బారిన పడకుండా ఉండాలని సీఐ రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో మేనేజర్ సుధాకరయ్య, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డితో కలసి రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించారు. వేగంగా వాహనాలను నడపడం, ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరమన్నారు. అలాగే ప్రయాణికులు ఎక్కే, దిగే సమయంలో వాహనాన్ని పూర్తిగా ఆపి ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే మైనర్లకు ద్విచక్రవాహనాలను తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మైనర్లు యాక్సిడెంట్లకు కారకులైతే తల్లిదండ్రులపై కేసులు తప్పవని హెచ్చరించారు. లైసెన్సులు, తగిన రికార్డులు ఉన్న వాహనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, అలాంటి వాటినే రహదారులలో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్రాంతి సంబరాలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో సోమవారం ఇంటింటా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఇళ్ల ముంగిట రంగువల్లులు వేసి గొబ్బెమ్మలను పెట్టారు. కులదేవతలకు పూజలు చేశారు. సాంప్రదాయబద్ధంగా పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. అలాగే పల్లెల్లో గ్రామ దేవత ఆలయాల వద్ద పొంగళ్లు పెట్టారు. వయోభేదం లేకుండా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అలాగే, మంగళవారం కనుమ పండుగను పురస్కరించుకుని గోపూజలు చేశారు. చిత్తూరులోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



పరుగులు తీస్తున్న కోడెగిత్తను నిలువరించేందుకు యత్నిస్తున్న గ్రామస్తులు

ఉత్సాహంగా ఎద్దుల పోటీలు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మిందలో మంగళవారం ఎద్దుల పోటీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా సాగాయి. తొలుత కనుమ పండుగను పురస్కరింకుని గోమాతలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో ఎద్దుల పోటీలను ప్రారంభించారు. ఎద్దులు, కోడెగిత్తలను పరుగులు తీయించారు. వీటిని నిలువరించేందుకు యువకులు, పెద్దలు నువ్వా, నేనా? అంటూ పోటీ పడ్డారు. పోటీలో నెగ్గిన వారు బహుమతులను అందుకున్నారు. ఈ పోటీలను తిలకించేందుకు మండల ప్రజలతో పాటు తమిళనాడు ప్రజలు సైతం తరలివచ్చారు.

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం

ఐరాల: క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం పెంపొందుతుందని వైఎస్సార్‌సీపీ నేత ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఎం.పైపల్లెలో సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం క్రికెట్ టోర్నీలో విన్నర్స్‌గా నిలిచిన వడ్డిపల్లె జట్టుకు ఆయన తన సొంత నిధుల నుంచి రూ.10 వేలు, రన్నర్స్ మోటకాంపల్లె జట్టుకు రూ.5,116 ప్రోత్సాహక నగదు, షీల్డ్‌లు అందజేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

పూతలపట్టు : మండలంలో సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను సంబరంగా జరుపుకున్నారు. పి.కొత్తకోట పంచాయతీ డి.మిట్టూరులో కాటమరాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పొంగించారు.

దిగువమాఘంలో..

తవణంపల్లె: మండలంలోని దిగువమాఘంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమర్‌రాజా బ్యాటరీస్ అధినేత గల్లా రామచంద్రనాయుడు, గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రాజన్న పార్కులోని మాజీ ఎంపీ రాజగోపాల్ నాయుడు కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు.

బంగారుపాళెం : మండలంలో సంక్రాంతి, కనుమ పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

ఐరాల: మండలంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలు వీధులను ముగ్గులతో అలంకరించారు. రంగవల్లుల మధ్యలో గొబ్బెమ్మలను కొలువుదీర్చారు.

యాదమరి: మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నడి వీధిలో అంబలిపోసి అమ్మవారికి పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. పశువులను అలంకరించి పరుగులు తీయించారు.



చిత్తూరు రూరల్: పొంగళ్లు పెట్టి గొబ్బి పాటలు పాడుతున్న మహిళలు





తవణంపల్లె : సంక్రాంతి సంబరాల్లో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, కుటుంబసభ్యులు, విన్నర్స్‌కు నగదు, షీల్డ్ అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

అట్టహాసంగా పోతురాజు జాతర



పోతురాజస్వామి ఊరేగింపులో కళాకారులు, భక్తులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర పరిధిలోని నరికపల్లెలో మంగళవారం పోతురాజు జాతరను అట్టహాసంగా నిర్వహించారు. నడివీధిలో పోతురాజు విగ్రహాన్ని కొలువుదీర్చి, ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఊరేగింపుగా వచ్చి నైవేద్యం సమర్పించారు. డప్పు వాయిద్యాల నడుమ సాయంత్రం స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఊరేగింపులో కళాకారుల నత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.